గోషామహల్‌ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



బేగంబజార్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్‌, కార్పొరేటర్‌ శంకర్‌ యాదవ్‌, ఆల పురుషోత్తమ్‌రావు

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే రాజాసింగ్‌ అన్నారు. సోమవారం బేగంబజార్‌ కిషన్‌గంజ్‌ వద్ద రూ.14 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, మంగళ్‌హాట్‌లో మరో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు పనులను బేగంబజార్‌ కార్పొరేటర్‌ శంకర్‌యాదవ్‌, మంగళ్‌హాట్‌ కార్పొరేటర్‌ శశికళ కృష్ణ, గోషామహల్‌ బీజేపీ సీనియర్‌ నాయకుడు ఆల పురుషోత్తమ్‌ రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజాసింగ్‌ మాట్లాడుతూ..పదేళ్లలో నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆల పురుషోత్తమ్‌ రావు, గణేష్‌ యాదవ్‌, డి.శంకర్‌, రవీందర్‌ సింగ్‌, నరహరి, సురేష్‌, రవీందర్‌ గుప్తా, జేడీ నితిన్‌, గోషామహల్‌ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్టలో సమస్యలు పరిష్కరించాలి



జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకుల బృందం సోమవారం జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోన్‌ జోనల్‌ కమిషనర్‌ టి.వెంకన్నను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. శివాజీనగర్‌ ఓపెన్‌ నాలా ప్రహరీ నిర్మాణం, అరుంధతి కాలనీ, లలితాబాగ్‌, క్రాంతి నగర్‌ హిందూ శ్మశాన వాటికలలో సదుపాయాల కల్పన, ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్లల్లో హైమాస్ట్‌ దీపాలు లేకపోవడంతో, బస్తీలలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఆలయాలపై దాడులు, దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా అభివృద్ధి పనుల మంజూరీలో స్థానిక కార్పొరేటర్ల సిఫార్సులు లేకుండా చూడాలన్నారు. బీజేపీ ఉప్పుగూడ డివిజన్‌ అధ్యక్షుడు మేడి సాయి ప్రసాద్‌ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చిన ఈ కార్యక్రమంలో పార్టీ భాగ్యనగర్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడీ మహేందర్‌, సీనియర్‌ నాయకులు ఆదర్ల మహేష్‌, ఎడ్ల పండరీనాథ్‌, పొన్న శ్రీనివాసారావు, సురేందర్‌, సురేష్‌ కుమార్‌, మామిడి కృష్ణ, లక్ష్మణ్‌, రవి, విజయ్‌, రవి కుమార్‌, బాలు, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోం

ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌



భూములు, ఇళ్లకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్‌ అనితరెడ్డి

గోల్కొండ: అకారణంగా ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్‌ తహసీల్దార్‌ అనితారెడ్డితో కలిసి మజీద్‌ ఉమర్‌ ఫారూఖ్‌ హకీంపేట్‌ ప్రభుత్వ పాఠశాల తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హెచ్‌ఎండీఏ వారు ఈ ప్రాంతంలో సరిహద్దులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని దీన్ని వల్ల స్థానికులు నష్టపోయే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే అన్నారు. హెచ్‌ఎండీఏ అధికారులను ఈ ప్రాంతంలోకి సర్వే చేయనివ్వమని స్థానికులకు ఇబ్బందులు పెట్టే ఏ పనైనా సరే తాము అడ్డుకుంటామన్నారు. సరిహద్దులు నిర్ధారించడంలో పేదలు వారి ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఇది తమకు ఏ మాత్రం ఆమోదయోగం కాదని ఆయన అన్నారు. హెచ్‌ఎండీఏ హకీంపేట్‌కు వస్తుందన్న విషయం తెలియగానే స్థానికులు తన వద్దకు వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. సరిహద్దులు బిగించే క్రమంలో తమ ఇళ్లు కోల్పోతామేమో అని అందరూ ఆందోళన చెందుతున్నారన్నారు. ఆయన వెంట మజ్లిస్‌ నాయకులు ఆలీముద్దీన్‌, షేక్‌పేట్‌ మండల కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు. అనంతరం ఆయన నగరంలో జరిగిన బీసీల సమరభేరికి తరలివెళ్లారు. బీసీలకు తమ పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని ఆయన అన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌, కార్పొరేటర్లు, తహసీల్దార్‌

యాకుత్‌పురా: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ సూచించారు. చార్మినార్‌ మండల పరిధిలో మంజూరైన 240 షాదీముబారక్‌ చెక్కులను సోమవారం యాకుత్‌పురాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్లు, తహసీల్దార్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకలపై ప్రజలకు అవగాహన ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గం పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు షాదీ ముబారక్‌ చెక్కులను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ సమీనా బేగం, నస్రీన్‌ సుల్తానా, అలాందార్‌ వాలాజాహి, ముజఫర్‌ హుస్సేన్‌, చార్మినార్‌ తహసీల్దార్‌ నిహారిక, డిప్యూటీ తహసీల్దార్‌ మన్సూర్‌ అలీ పాల్గొన్నారు.




వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

ముగిసిన సినాప్సిస్‌ వర్క్‌షాప్‌

గోల్కొండ: షేక్‌పేట్‌ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగిన ఐదు రోజుల సినాప్సిస్‌ ఆర్‌టీఎల్‌-జేడీఎస్‌-2 సినాప్సిస్‌ వర్క్‌షాప్‌ ముగిసింది. జీఎన్‌ఐటీఎస్‌ అటల్‌ ఇంక్యూబేషన్‌ సెంటర్‌ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో వీఎల్‌ఎస్‌ఐ ఎక్స్‌పర్ట్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఫౌండర్‌ అండ్‌ సీఈఓ పునీత్‌ మిథల్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సినాప్సిస్‌ టూల్స్‌ ఉపయోగం, ప్రాధాన్యం, ప్రయోజనాలు తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జీఎన్‌ఐటీఎస్‌, ఏఐసీ, వీఎల్‌ఎస్‌ఐ ఎక్స్‌పర్ట్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ల మధ్య ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా జీఎన్‌ఐటీఎస్‌ వైస్‌ ఛైర్‌పర్సన్‌ జి.శ్రీవిద్యారెడ్డి మాట్లాడుతూ.. జీఎన్‌ఐటీఎస్‌లో ఈ ఒప్పందంతో సరికొత్త అధ్యాయం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో సినాప్సిస్‌ ఇండియా యూనివర్సిటీ ప్రోగ్రామ్‌ మేనేజర్‌ సంకల్ప్‌సింగ్‌, కే.నరేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్‌ కె.రమేష్‌రెడ్డి, ఈసీఈ డిపార్ట్‌మెంట్‌ హెడ్‌ డాక్టర్‌ కె.రాగిని, జీఎన్‌ఐటీఎస్‌ ఏఐసీ సీఈవో డాక్టర్‌ శాశ్వత్‌పాలక్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో పాల్గొన్న జోనల్‌ కమిషనర్‌ తదితరులు

చార్మినార్‌: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ వెంకన్న అన్నారు. జోనల్‌ కమిషనర్‌ వెంకన్న పర్యవేక్షణలో సోమవారం నర్కిపూల్‌ బాగ్‌లోని జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ప్రజావాణిలో చాంద్రాయణగుట్ట బండ్లగూడ ప్రాంతంలో వీధి దీపం సమస్యపై ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ మాట్లాడుతూ..ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్‌ (వెటర్నరీ) డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్‌ అమీనా బీ, మలేరియా విభాగం సీనియర్‌ ఎంటమాలజిస్ట్‌ నామల శ్రీనివాస్‌, టౌన్‌ ప్లానింగ్‌ సీపీ ఎంఏ మాజీద్‌, ఎలక్ట్రికల్‌ ఈఈ రామారావు, బిల్‌ కలెక్టర్‌ రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పురాతన కట్టడాలు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మరమ్మతుల పేరుతో నిధుల దుర్వినియోగం
- ప్రహసనంగా మారిన మచిలీ కమాన్‌ పనులు



మచిలీ కమాన్‌కు పెచ్చులూడిన దృశ్యం



మచిలీ కమాన్‌పై పెరిగిన పిచ్చి మొక్కలు

చార్మినార్‌: శిథిలావస్థకు చేరిన పురాతన కట్టడాలను పరిరక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రాబోయే రోజుల్లో వాటి ఉనికి కనుమరుగు అయ్యే పరిస్థితులు ఉన్నాయి. వరల్డ్‌ హెరిటేజ్‌ వీక్‌ సందర్భంగా అక్కడక్కడ కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు తప్పా..హెరిటేజ్‌ కట్టడాలను పరిరక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోలేదు. శిథిలావస్థకు చేరిన హెరిటేజ్‌ కట్టడాల మరమ్మతు పనులపై సంబంధిత అధికారులు ఎలాంటి దృష్టి సారించలేదు.

పురాతన కట్టడాలకు నిలయం పాతబస్తీ..

పురాతన కట్టడాలకు నిలయమైన పాతబస్తీపై సంబంధిత ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఇందుకు మచిలీ కమాన్‌ ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. నిజాం కాలంలో చార్మినార్‌ కట్టడానికి ఉత్తరం వైపున గుల్జార్‌హౌస్‌ నలువైపులా నాలుగు కమాన్లను నిర్మించారు. ప్రస్తుతం ఈ కమాన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో వీటి మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి కొన్ని నిధులను విడుదల చేసి అక్కడక్కడ మరమ్మతు పనులు చేపట్టింది. అయితే నిధులు మాత్రం ఖర్చు అయ్యాయి..కానీ పనులు మాత్రం పూర్తి స్థాయిలో జరగలేదు. జరిగిన కొన్ని పనులు సైతం నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

మరమ్మతు పనులు కాగితాలకే పరిమితం..

చార్మినార్‌ ప్రధాన రోడ్డులో గుల్జార్‌హౌజ్‌కు ఉత్తరం వైపున ఉన్న మచిలీ కమాన్‌కు గతంలో మరమ్మతులు చేయించారు. అయితే ఈ మరమ్మతు పనులు ఎంతో కాలం నిలువలేదు. ఎక్కడికక్కడ గోడల పెచ్చులు ఊడిపోయాయి. అంతేకాకుండా కమాన్‌పై భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. మరమ్మతులు జరిగేటప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండడం లేదు. మరమ్మతు పనులు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పనులు జరిగినట్లు సంబంధిత కాంట్రాక్టర్లు నివేదికలను రూపొందించి సంతకాల కోసం తీసుకువస్తే..ఆమోద ముద్ర వేస్తున్నారు. దీంతో తూతూ మంత్రంగా నిర్వహించిన మరమ్మతు పనులకు నిధులు విడుదలవుతున్నాయి తప్పా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దీంతో ప్రభుత్వం నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ఏసీ రూములకే పరిమితం కాకుండా సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయని పాతబస్తీ ప్రజలు అంటున్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

అఫ్జల్‌గంజ్‌: భాగ్యనగర్‌ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మేడిశెట్టి రాకేష్‌, కోశాధికారి, సీఏ అనిల్‌నాయర్‌ పేర్కొన్నారు. ఈ మేరకు ఉస్మాన్‌గంజ్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివరాలను వెల్లడించారు. సమావేశంలో క్యాతం రాధాకృష్ణ మాట్లాడుతూ.. బాస్‌ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా అయ్యప్ప మాల దీక్ష ధరించిన అయ్యప్ప స్వాములకు 41 రోజుల పాటు అన్నదానం, అల్పాహారం విజయవంతంగా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. త్వరలో ఎగ్జిబిషన్‌ మైదానంలో కూడా భారీ ఎత్తున అయ్యప్ప మహా పడిపూజ సైతం నిర్వహిస్తామని రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్‌ అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు కాటేపల్లి రాజు, నార్ల జగదీష్‌, నర్సింగ్‌రావు, విజేందర్‌ రెడ్డి, వై.అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

పేట్ల బురుజులో ఎన్సీడీ క్లినిక్‌ ప్రారంభం



వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్‌ రజనీరెడ్డి

చార్మినార్‌/దూద్‌బౌలి: పేట్లబురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఎన్సీడీ(నాన్‌ కమ్యూనికేబుల్‌ డిసీజెస్‌) క్లినిక్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రజినిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ క్లినిక్‌ గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. దీంతో పాటు కేన్సర్‌ స్క్రీనింగ్‌, గర్భిణులకు రక్తహీనత, బీపీ, షుగర్‌తో పాటు అన్ని రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత నెల అక్టోబర్‌లో సిజేరిన్‌ ద్వారా 542 ప్రసవాలు, మేజర్‌ ఆపరేషన్‌ ద్వారా 631 మైనర్‌ ప్రసవాలు, 381 డీపీఎల్‌ఎస్‌, 210 ప్రసవాలు జరిగాయని ఆమె వివరించారు. వివిధ జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ఎలాంటి సమస్యలు రాకుండా 24 గంటలు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగులతో పాటు వారి సహాయకుల వద్ద నుంచి ఆసుపత్రి సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం



జహంగీర్‌

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.దామోదర్‌ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా అనీస్‌ సుల్తానా మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్‌ జహంగీర్‌ (42) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు జహంగీర్‌ ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువులు వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని తల్లి జైబ్‌ ఉన్నీసా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతోనే బీజేపీకి ఆదరణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్‌: ప్రధాని నరేంద్రమోదీ అందజేస్తున్న సంక్షేమ పథకాలతోనే బీజేపీకి ఆదరణ లభిస్తుందని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి డాక్టర్‌ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ కార్యాలయ రాష్ట్ర కో ఆర్డినేటర్‌ డి.గోపాల్‌జీ పేర్కొన్నారు. కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం గోల్కొండ జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు బూత్‌ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ప్రకాష్‌రెడ్డి, డి.గోపాల్‌జీ మాట్లాడుతూ..గోల్కొండ జిల్లాతో పాటు అన్ని ప్రాంతాల్లో బీజేపీ సభ్యత్వం జోరుగా సాగుతుందన్నారు. వ్యాపారులు, స్థానిక బస్తీలు, కాలనీల ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే గెలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘునందన్‌ యాదవ్‌, కార్పొరేటర్‌ భీశ్వ సురేఖ, నరహరి, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ ఆన్స్‌లో జెష్టా–2024 ఫెస్టివల్‌

గోల్కొండ: కళాశాలల్లో జరిగే సెమినార్‌లు, వార్షిక ఫెస్టివల్స్‌ విద్యార్థినుల్లో నూతన ఉత్తేజంతో పాటు వారిలో ఉత్సాహాన్ని నింపుతాయని మెహిదీపట్నం సెయింట్‌ ఆన్స్‌ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సిస్టర్‌ ఏ.విజయరాణి అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని సెయింట్‌ ఆన్స్‌ కళాశాలలో జెష్టా–2024 ఫెస్టివల్‌ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థినులు వివిధ రకాల ఫుడ్‌ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఫెస్టివల్స్‌ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు విభిన్న వంటల రుచులు, సంప్రదాయ వంటకాలను అద్దం పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నోబయోమ్‌ టెక్నాలజీస్‌ ఫౌండర్‌ డాక్టర్‌ సుకుమార్‌, కరుగంటి, డాక్టర్‌ మేరీ ఫ్యాన్సీనా, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలి



డీఎం అండ్‌ హెచ్‌ఓ డాక్టర్‌ వెంకటిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

గౌలిపురా: వైద్య ఆరోగ్య శాఖలో 2000 సంవత్సరం నుంచి కాంట్రాక్ట్‌ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజ్‌ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌ జిల్లా డీఎం అండ్‌ హెచ్‌ఓ డాక్టర్‌ వెంకటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్‌ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు రెగ్యులరైజేషన్‌, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలన్నారు. దశాబ్దాల తరబడి దశలవారీగా సమస్యల పరిష్కారానికి ఆందోళనలు, పోరాటాలు, నిరవధిక సమ్మెలు చేశామన్నారు. సమ్మెల సందర్భంగా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలుకావడం లేదన్నారు. సర్వీసు వెయిటేజీ 50 మార్కులు ఇవ్వాలన్నారు. వయోపరిమితిని ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎ.కవిత, పి.లక్ష్మీబాయి, కిరణ్మయి, బి.సునీత, ఎం.సంతోషమ్మ, విజయ కుమారి, ప్రమీల, సత్యరాణి, సువర్ణ, ఆర్‌.కవిత, కుమార స్వామి, రమా, అమ్మాజీ, సులోచన ఉన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన చిన్నారులు



విజేతలతో సాయిబాబాచారి

గోల్కొండ: పిల్లలను వారికి ఇష్టమైన క్రీడల్లో చిన్నతనం నుంచే శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి సలహాదారు బి.సాయిబాబాచారి అన్నారు. స్విమ్మింగ్‌ కోచ్‌ వినోద్‌ ఆధ్వర్యంలో ఓర్కా ఈత పోటీలు సోమవారం ముగిశాయి. అర్చన, రాకేష్‌, నేహా విజేతలుగా నిలవగా బి.సాయిబాబాచారి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా కాలభైరవ జయంతి



వేడుకల్లో పూజారి రాజేశ్వర్‌, హెచ్‌. కుమార్‌ తదితరులు

అబిడ్స్‌: రహీంపురాలోని కాలభైరవ ఆలయంలో ఎస్‌ఎస్‌కే సమాజ్‌ వారు కాలభైరవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి అభిషేకం, అర్చన ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో పూజారి రాజేశ్వర్‌, హెచ్‌.కుమార్‌, విఠల్‌, తిర్మల్‌ జయప్రకాష్‌, గణేష్‌ పవర్‌, సచిన్‌, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న మహ్మద్‌ బషీర్‌ తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు ప్రతినిత్యం ఒక పూట కడుపు నిండా అన్నం పెట్టడమే తమ లక్ష్యమని గోల్కొండ సెకండ్‌ లాన్సర్‌ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్‌ బషీర్‌ అన్నారు. సోమవారం ఆయన నగరంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పేద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరంగా ఈ కార్యక్రమం కొనసాగించేందుకు తోటి ఉద్యోగులు, శ్రేయోభిలాషుల అండదండలు అందిస్తున్నారన్నారు.

వెలగని వీధి దీపాలు



ఉప్పుగూడలో..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని పలు బస్తీల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొంటుంది. ముఖ్యంగా ఉప్పుగూడ, లలితాబాగ్‌, బార్కాస్‌ డివిజన్లలో నెలల తరబడిగా నెలకొన్న ఈ సమస్య స్థానికులను తీవ్రంగా వేధిస్తుంది. బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్‌ ఎడ్ల పండరీనాథ్‌ ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆయన మండిపడ్డారు. చీకటి మాటున అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండడం..సాయంత్రం అయ్యిందంటే పాదచారులు బస్తీలలో తిరగలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



త్రివేణి సంగం మధ్యలో శివలింగాలకు దీపారాధన

లంగర్‌హౌస్‌: కార్తీక ముక్తి స్నానాల జాతరలో భాగంగా కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా త్రివేణి సంగమం కార్తీక శోభతో విరాజిల్లింది. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్‌ బాబా ఆధ్వర్యంలో త్రివేణి సంగం నది మధ్యలో సోమవారం రాత్రి శివలింగాలకు ప్రత్యేక పంచామృతాభిషేకాలు, పువ్వులతో అందంగా అలంకరణ, దీపారాధన నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు లింగారెడ్డి, మామిడాకుల క్రిష్ణ దంపతులు, భిక్షం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వర ఆలయంలో..



త్రయంబకేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అబిడ్స్‌: కార్తీకమాసం సోమవారం పూజలు గుడిమల్కాపూర్‌ త్రయంబకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని దీపాలంకరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేందర్‌, ఉపాధ్యక్షుడు గిరిధర్‌ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎక్స్‌ సర్వీస్‌మెన్‌ కాలనీలో..



పంచామృత అభిషేకం చేస్తున్న అర్చకులు శ్రీనివాస శర్మ

నాంపల్లి: ఎక్స్‌ సర్వీస్‌మెన్‌ కాలనీలోని హనుమాన్‌ మందిరంలో కార్తీక మాసం చివరి సోమవారం పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రదోష కాలంలో స్వామివారికి పంచామృత సహిత సర్వద్రవ్యాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు కె.శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయంలో ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం సాయంత్రం వేళల్లో కార్తీక మాసోత్సవం పూజలు జరుగుతాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఈఓ కొడకండ్ల శ్రీనివాస శర్మ ఏర్పాట్లను చేశారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: గుడిమల్కాపూర్‌ డివిజన్‌లోని జాఫర్‌గూడ ముత్యాలమ్మ ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. ఈ పూజల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సందుల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్‌, ప్రభు పూజారి తదితరులు పాల్గొన్నారు.